
www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 16 అక్టోబర్ 2025 5 కాకినాడ



ఎన్ఎంఎంఎస్‌కు 25 వరకూ గడువు

ప్రజాశక్తి-కాకినాడ

డిసెంబర్ 12న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్‌ను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉంచినట్లు డిఇఒ పిల్లి రమేష్ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షక నమోదుకు ఈ నెల 25 వరకు పొడిగించినట్లు తెలిపారు. పరీక్ష రుసుము చెల్లించడానికి ఈనెల 27వ తేదీ ఆఖరి తేదీ అన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బిఐ కలెక్ట్ రశీదును డిఇఒ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీ లోపు సమర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, 7వ తరగతిలో 55 శాతం మార్కులు వచ్చి కుటుంబ సంవత్సరాదాయం రూ.3,50,000 లోపు విద్యార్థులు అందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట

- సదుపాయాల్లేక విద్యార్థుల అవస్థలు
- పెరగని మెస్, కాస్మొటిక్ ఛార్జీలు
- అరకొర సంక్షేమమే దిక్కు
- ప్రభుత్వ చర్యలు శూన్యం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో ఉన్న సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో విలవిల్లాడుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా సంక్షేమ హాస్టళ్లల్లో పరిస్థితుల్లో మాత్రం మార్పులు కనిపించడం లేదు. పలు హాస్టళ్లల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కాకినాడ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 22 పోస్ట్ మెట్రిక్, 12 ప్రిమెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 4 వేల మంది పిల్లలు ఏటా చదువుతున్నారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 17 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 1058 మంది, 23 ప్రిమెట్రిక్ హాస్టళ్లలో 1048 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరిలో సుమారు 1000 మంది వరకూ పదో తరగతి విద్యార్థులున్నారు.

శిథిలావస్థలో భవనాలు

కాకినాడ జిల్లాలో పలు సంక్షేమ హాస్టళ్ల శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం సంక్షేమ గృహాలకు శాశ్వత భవనాలు నిర్మించకుండా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తోంది. ప్రభుత్వం నెలలు తరబడి అద్దెలు చెల్లించడం లేదు. దీంతో భవనాల యజమానులు వాటికి మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అప్పటికే శిథిలావస్థకు చేరిన సంక్షేమ హాస్టళ్ల ఎప్పుడు కూలిపోతాయో అన్న విధంగా విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ భయంతో గడుపుతున్నారు.

కాకినాడ జగన్నాధపురంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల హాస్టల్లో సుమారు 200 మంది హాస్టల్లో ఉంటే కేవలం నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. ఈ హాస్టల్లో 200 మందికి సరిపోవడం లేదు. ఇరుకు గదుల్లోనే సహవాసం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో నిద్ర సరిగా పడకపోవడంతో తరచూ విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారు. మరోవైపు దోమల దండయాత్ర ఎక్కువగా ఉంది. కిటికీలకు డోర్లు, మెస్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇదే హాస్టల్లో తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోలీలపేటలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాల హాస్టల్ భవనం మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే వర్షం నీరంతా హాస్టల్ భవనంలోకి వచ్చి చేరడంతో విద్యార్థులు అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారు. సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఇంటి ఎదురుగా ఉన్న కళాశాల బాలికల హాస్టల్ భవనానికి గదులు లేవు. ఒకే హాలు ఉంది. సుమారు 120 మంది విద్యార్థులు ఓపెన్ కమ్యూనిటీ హాల్లోనే వీరు దాసుకుంటున్నారు. కనీసం డ్రెస్సింగ్ చేసుకోవడానికి కూడా మరుగు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక తీవ్ర స్థాయిలో సతమతం అవుతున్నారు. ఆదే ప్రాంతంలోని బిసి బాలికల కళాశాల హాస్టల్ గతంలో శిథిలావస్థకు చేరితే అక్కడున్న విద్యార్థులను అద్దె భవనంలోకి తరలించి రెండేళ్ళ గడుస్తున్నా నేటికీ ఆ భవనం కూల్చి కొత్త భవనం నిర్మించడం లేదు. ఆదే కాంపౌండ్‌లో ఉంటున్న పాఠశాల విద్యార్థులు రూములు వర్షానికి కారిపోతున్నా అందులోనే ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. కాకినాడ తిలక్ స్ట్రీట్‌లో ఉన్న బిసి బాలుర కళాశాల హాస్టల్ భవనంలో 200 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు సరిపడినన్ని మరుగుదొడ్లు లేక కేవలం ఆరు బాత్రూములతోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీటి సమస్య కూడా ఈ హాస్టల్‌ను వేధిస్తోంది. తుని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర హాస్టల్ రెండేళ్ల నుంచి వార్డెన్ పోస్ట్ లేకపోవడంతో ఎఎస్‌డబ్ల్యు ఆఫీసులో ఉన్న జూనియర్ అసిస్టెంట్‌తో హాస్టల్ నిర్వహించడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందడం లేదు. ఇలా పలు వసతి గృహాలు సమస్యల నడుమ సాగుతున్నాయి.

పెరుగుతున్న ధరలు.. పెరగని ఛార్జీలు..

పెరిగిన ధరలతో పోల్చితే హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది. పిల్లలకు సరైన పౌష్టికాహారం అందడం లేదు. మూడు, నాలుగో తరగతి విద్యార్థుల కోసం రూ.1,150కు (రోజుకి రూ.38), ఐదు, పదో తరగతి చదువుకునే వారికి రూ.1,400 (రోజుకి రూ.47), ఇంటర్, ఆపై విద్యార్థులకు రూ.1,600 (రోజుకి రూ.53) కు మాత్రమే ఇస్తున్నారు. రోజు ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం కలిపి ఒక్కొక్కరికి ప్రభుత్వం ఈ మొత్తం మాత్రమే అందజేస్తోంది. బయట మార్కెట్లో భోజనం చేయాలంటే రూ.100 తక్కువ లేదు. టిఫిన్ తినాలన్నా రూ.30 నుంచి 40 ఖర్చు అవుతోంది. ఈ పరిస్థితుల్లో రూ.38 నుంచి రూ.53 ఇస్తున్నదంచన ఏ మేరకు మెనూ ఛార్జీలను అమలు చేయాలనేది ప్రశ్నార్థకంగా మారింది. కూరగాయల ధరల నుంచి మొదలుకొని పప్పులు, ఆయిల్, గ్యాస్ ఇలా అన్ని రకాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పుడు ఇస్తున్న మెనూ ఛార్జీలతో ఏ విధంగా పౌష్టికాహారం వండి పెట్టాలనేది వార్డెన్లకు తలనొప్పిగా మారింది.

3వ తరగతి నుంచి 6 వరకు బాలురకు నెలకు రూ.175, ఏడో తరగతి నుంచి 10 వరకు రూ.200, మూడో తరగతి నుంచి 6 వరకు బాలికలకు రూ.130, ఏడో తరగతి నుంచి 10 వరకు రూ.200, ఇంటర్ ఆపై బాలురు, బాలికలకు రూ.250 చెల్లిస్తున్నారు. పెరుగుతున్న ధరలతో పోలిస్తే సరిపోవడం లేదని పలువురు విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సంక్షేమ వసతి గృహాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



కాకినాడ జగన్నాధపురంలో బాలికల హాస్టల్లోకి ఇటీవల వచ్చి చేరిన వర్షపు నీరు



సంక్షేమంపై చిన్న చూపు తగదు

బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు వసతి పొందుతున్న సంక్షేమ హాస్టళ్ల విషయంలో ప్రభుత్వం చాలా చిన్నచూపు చూస్తుంది. పలు హాస్టళ్లు శిథిలావస్థకు చేరి ఉన్నా వాటి మరమ్మతుల విషయంలో చర్యలు తీసుకోవడం లేదు. మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచి తక్షణమే అమలు చేసి సమస్యను పరిష్కరించాలి.

- ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

జిజిహెచ్‌లో బేరా యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఇఎన్‌టి విభాగంలో బేరా (బ్రెయిన్ స్టెమ్ ఎవొక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ) యూనిట్‌ను బుధవారం జిజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ప్రారంభించారు. నూతనంగా పునరుద్ధరించిన సౌండ్ ప్రూఫ్ ఆడియోమెట్రీ గదిని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ లావణ్య కుమారి మాట్లాడుతూ బేరా యూనిట్ ఏర్పాటు వల్ల రోగులకు అత్యాధునిక శ్రవణ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వస్తాయన్నారు. దీని ద్వారా వైద్యసేవలు మరింత సమర్థవంతంగా అందించ గలుగుతున్నామన్నారు. ఈ పరీక్ష ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ చేయలేని రోగులకు, ముఖ్యంగా నవజాత శిశువులు, పిల్లలు, మానసిక వెనుకబాటు ఉన్నవారు, సహకరించ లేని రోగులు వంటి వారిలో వినికిడి స్థాయిని అంచనా వేయటానికి చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పి. విజయ దీప్తి, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ మెహర్ కుమార్ పాల్గొన్నారు.



యూనిట్‌ను ప్రారంభిస్తున్న సూపరిండెంట్ డాక్టర్ లావణ్య



సామాజిక తనిఖీ సభలో సమీక్షిస్తున్న పీడీ వెంకటలక్ష్మి

ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో మొత్తం 94 పనులకుగాను మెటీరియల్ రూపంలో రూ.మూడు కోట్ల 83 లక్షల 61,58, వేతన రూపంలో రూ.ఆరు కోట్ల 87 లక్షల 83 వేల 860, వెరసి మొత్తం రూ.10 కోట్ల 71 లక్షల 42,4 48 ఖర్చు చేసినట్టు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి చెప్పారు. సామర్లకోట మండల కార్యాలయంలో బుధవారం వార్షిక సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి అధ్యక్షత వహించారు. పలు సందర్భాల్లో సామాజిక తనిఖీ బృందం రూ.1,72,224 రికవరీ చేసినట్టు పీడీ ప్రకటించారు. ఎపిడి వసంత మాధవి, డిఐఒపి విజయభాస్కర్, ఎపి సార్ట్ బి.రామారావు, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎస్ఆర్‌పి సిహెచ్.సత్యనారాయణ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

బాలల ఆరోగ్యానికి కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

బాలల సంపూర్ణ ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తోందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఐసిడిఎస్ సామర్లకోట కార్యాలయంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక సీమంతాల కార్యక్రమం సిడిపిఒ జి.ఉష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ చినరాజప్ప పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య వంతమైన సమాజానికి అంగన్వాడీ కేంద్రాలు వేదికగా నిలుస్తున్నాయన్నారు. వీటిద్వారా పుట్టినరోజు బిడ్డ మొదలు బాలింతలకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణ భాద్యతలు అంగన్వాడీలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, జనసేన నాయకులు పిట్టా జానకి రామారావు, సిడిపిఒ ఉష మాట్లాడారు. కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, సరోజ వాసు, సొసైటీ అధ్యక్షులు పైణ్ణి శ్రీనివాసరావు, వల్లూరి దొరబాబు, సుల్తానా బీబీ, ఎన్.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'





అవగాహనా ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట, శంఖవరం

జిఎస్‌టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికీ ప్రయోజనం కలుగుతుందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట భీమేశ్వరాలయం వద్ద బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్, అడబాల కుమారస్వామి, సరోజ వాసు, పిట్టా జానకి రామారావు, విత్తనాల వెంకటరమణ, బలుసు వాసు, వల్లూరి దొరబాబు, తాతపూడి అరుణ్ వంశీ, సొసైటీ అధ్యక్షులు పైణ్ణి శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాద్, కంచర్ల సుష్మ మోహిని, కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శంఖవరం అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆధ్వర్యంలో తలపెట్టిన జిఎస్‌టి అవగాహన ర్యాలీని శ్రీ సత్య దేవ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఇఒ వీర్ల సుబ్బారావు జండా ఊపి ప్రారంభించారు. దీనిపై మరింత అవగాహన కలిగేందుకు సత్యదేవ విద్యా సంస్థల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వోహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటే, ఎఇఒ భాస్కర రావు, పర్యవేక్షణ అధికారి యనమల అప్పారావు, పసుపులేటి రమేష్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా రామ్‌కుమార్ బాధ్యతలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గొల్లప్రోలు తహశీల్దారుగా జిఎం.రామ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పిఠాపురం పాడా కార్యాలయంలో డిటిగా పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఆయనను డిటి సౌజన్య, ఆర్ఐ బాలకృష్ణ, ఆర్‌డిటి ఎస్‌కె మస్తానీ, రెవెన్యూ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి- తాళ్లరేవు

సిహెచ్‌సికి ప్రతి బుధవారం వచ్చే గర్భిణులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహారం అందించారు. చిట్టూరి కృష్ణ కుమారుడు శివరాం కిషోర్, కుటుంబ సభ్యుల సహకారంతో ఈ ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, అభివృద్ధి కమిటి డైరక్టర్లు, లయన్ క్లబ్ ప్రతినిధులు ఉన్నారు.



గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న సభ్యులు

ఘనంగా గ్లోబల్ హ్యాండ్ వాష్ డే

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థులు హ్యాండ్ వాషింగ్‌ను అలవాటు చేసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బచ్చు ఫౌండేషన్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పాఠశాల స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులతో గ్లోబల్ హ్యాండ్ వాష్‌డేను నిర్వహించి హ్యాండ్ వాష్‌లోని దశలను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్ టీచర్లు పి.బ్రహ్మానందం, పి.నిర్మల, పీడీ పి.సుధారాణి, జి.జ్యోతి పాల్గొన్నారు.

శుభ్రమైన తాగునీటితో రోగాలు దూరం

ప్రజాశక్తి - సామర్లకోట

పరిశుభ్రమైన తాగునీటిని అందిస్తే ప్రజలకు కొన్ని రోగాలు రాకుండా చూడొచ్చని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కెఎన్‌వి.ప్రసాదరావు అన్నారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు, డిప్యూటీ ఎంపిడిఒల 8వ బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. త్వరలో ఈ రెండు విభాగాల గ్రామ స్థాయి అధికారులైన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు ఈ శిక్షణ ఇస్తామని ప్రిన్సిపల్ తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ అబ్దుల్ మదీన్ మాట్లాడుతూ భావితరాలకు తాగునీటి భద్రత కల్పించాల్సిన బాధ్యత రెండు శాఖలపై ఉందన్నారు. గ్రామస్థాయిలో తాగునీటి భద్రతపై ప్రణాళిక ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నైపుణ్య శిక్షణలు ఇప్పిస్తోందని ఆయన తెలిపారు. అనంతరం శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఇలు ఉమాశంకర్, శ్రీనివాస్, పెద్దాపురం డిఇ స్వామి, కాకినాడ డిఎల్‌పిఒ అమ్మాణి, ఫ్యాకల్టీ శేషుబాబు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్ కెఎన్‌వి ప్రసాదరావు

పత్తి, పట్టు రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పత్తి పంటపై పురుగు మందులు పిచికారీ చేసినప్పుడు పట్టుపురుగులు గూడు కట్టక పోవడంతో పట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం మండలంలోని చేబ్రోలు మహిళా సమాఖ్య భవనంలో దీనిపై పట్టు, పత్తి రైతులు, సెరికల్చర్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఓరుగంటి శ్రీను, ఉలవకాయల రాంబాబు, ఓరుగంటి నానాజీ ఆవేదనని వ్యక్తం చేశారు. 40 ఏళ్ల నుంచి పట్టు సాగు చేస్తున్నప్పటికీ పట్టుపురుగులు గూడు కట్టకపోవడం ఎప్పుడూ లేదన్నారు. 33 వేల గుడ్లు గూడు కట్టక నష్టపోయామన్నారు. సెంట్రల్ సిల్క్ బోర్డ్ సైంటిస్ట్ డాక్టర్ భువనేశ్వరి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.సీతారామశర్మ మాట్లాడుతూ పట్టుపురుగులు పెంపకం ఉన్నప్పుడు పత్తి రైతులు మందులు పిచికారీ చేసే ముందు పట్టు రైతుకి తెలియజేయాలని, పట్టు, పత్తి రైతులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పట్టుపురుగుల పెంపకం దగ్గర రక్షణ పంటగా జొన్న లేదా సజ్జ పంటలను ఐదు ఆరు వరుసల్లో ఒత్తుగా వేసుకొని పురుగుమందును పట్టుపురుగు దగ్గరికి చేరకుండా చూసుకోవాలన్నారు. పత్తి పంటలో కూడా చివరి నాలుగు వరుసలలో మందులు పిచికారి చేయవద్దన్నారు. జిల్లా సెరికల్చర్ డిడి రాజేంద్ర ప్రసాద్ బాబు, ఎఒ కెవివి.సత్యనారాయణ, చేబ్రోలు పట్టు పరిశ్రమ ఎఎస్ఒ సత్యనారాయణ, మాదేపల్లి సత్యానందరావు, రామకృష్ణ, యేసు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి

మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలామ్ జయంతిని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్‌లో అబ్దుల్ కలామ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. డీన్ డాక్టర డి.కిషోర్ మాట్లాడారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఎస్‌టివివిఎస్.కుమార్, పాలిటెక్నిక్ కళాశాల డీన్ మాధవరావు, గ్రంథాలయాధికారి కె.అశోక్ కుమార్, జాతీయ పర్యావరణ మిత్ర తోటకూర గంగాధర్, ఎ.సుజాత, రమ్య, సాయి రామ్ పాల్గొన్నారు.

పిఠాపురంలోని స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపల్ ఊటుకూరు కేశవరావు అధ్యక్షతన అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ శారద, జె.మాధవి, రామకృష్ణ, నాగేశ్వర్ రెడ్డి, మహమ్మద్ హుస్సేన్ మోయుద్దీన్, లక్ష్మణ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డి.కాశీవిశ్వనాథం, శోభన్ బాబు, ఇజె డేనియల్, పాల్గొన్నారు.

కరప గురజనాపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎ.సాయి మోహన్ అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వివి.రమణమూర్తి మాట్లాడారు.

పెద్దాపురం ప్రకాష్ సినర్జీ పాఠశాలలో అబ్దుల్ కలాం విగ్రహానికి ప్రొఫెసర్ ఎస్ఆర్.సంతానం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



పెద్దాపురంలో కలామ్‌కు నివాళులర్పిస్తున్న శ్రీప్రకాష్ సిబ్బంది



దుకాణదారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్, తదితర అధికారులు

నిబంధనల మేరకే బాణసంచా అమ్మకాలు

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

బాణసంచా దుకాణదారులు తప్పని సరిగా నిబంధనలను పాటించాలని తహశీల్దార్ చిరంజీవి సూచించారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలో దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. రిటైల్ షాపుల యజమానులకు పలు సూచనలు చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపిడిఒ హరికృష్ణ, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ , ట్రైనీ ఎస్ఐ ఎం.రాజు, అగ్నిమాపక అధికారి శ్రీరాముడు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఎల్ఎ సత్య ప్రభ

పౌష్టికాహారంతోనే మహిళలకు ఆరోగ్యం

ప్రజాశక్తి-శంఖవరం

నేటి ఆధునిక జీవన శైలిలో పౌష్టికాహారంతో మహిళలకు ఆరోగ్య రక్షణ ఉంటుందని ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరపుల సత్యప్రభ అన్నారు. బుధవారం శంఖవరం మండలం కత్తిపూడి వర్తక సంఘం కల్యాణ మండపంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు, అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పౌష్టికాహారం బాలింతలు, గర్భిణులకు అత్యంత అవసరమని తెలిపారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను పురుషులూ అర్థం చేసుకోవాలని, వారు కుటుంబ ఆరోగ్యంలో కీలక సూత్రధారులని తెలిపారు. ఊబకాయం, రక్తహీనత వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సరైన ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. విజేతలకు ఎంఎల్ఎ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఉద్యోగులు ,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలికగా నాతోనే మార్పు రండి ముందుకు అనే నినాదంతో ప్రతి బాలికా ముందుకు రావాలని బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు విద్యా పోషణ చట్టపరమైన హక్కులు వైద్య ఆరోగ్య సంరక్షణ రక్షణ హింస బలవంతపు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని, బాల్యవాహాల వల్ల అనర్థాలను నివారించి వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి బాలికల దినోత్సవం ప్రకటించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో అక్టోబర్ 11 నుండి 18 వరకు ఈ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసా దేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ ఒక లక్ష్యం ఉండాలని, విద్యార్థి లక్షణాలు తప్ప వ్యామోహాల వైపు వెళ్ళకూడదని సూచించారు. అనంతరం పాఠశాలలో బాలికలకు వ్యాసరచన పోటీలు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సిహెచ్.సూర్యప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్

పంట కాల్వలోకి దూసుకెళ్లిన వ్యాన్

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

వ్యాను అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లిన సంఘటనలో బుధవారం ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్లం గ్రామానికి చెందిన కొంతమంది శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా యు.కొత్తపల్లి మండలం ఎండపల్లి, నాగులపల్లి వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వ్యాన్ పంట కాలువలోకి దూసుకెళ్లింది. వ్యాన్‌లో ఉన్న 30 మంది సురక్షితంగా బయటపడినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

కంటైనర్ లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారులో బుధవారం చోటుచేసుకుంది... బంధువులు, తోటి ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం. నిడదవోలుకు చెందిన అహ్మద్ జవహర్(45) మండలంలోని కరిచర్లగూడెం గ్రామంలో ఉన్న ఓంకార్ ఫెర్టిలైజర్ కంపెనీలో మూడు నెలలుగా ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం కంపెనీ పని నిమిత్తం పంగిడికి వచ్చిన అతను తిరిగి ఫ్యాక్టరీకి ద్విచక్రవాహనంపై వెళ్లే క్రమంలో గోపాలపురం శివారులో కంటైనర్ లారీ వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బంధువులకు సమాచారం ఇచ్చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. లారీని స్టేషన్‌కు తరలించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల పరిధిలోని పోచవరం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 1800 కేజీల పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఒక ఇంటిలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లుగా వచ్చిన సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చౌక ధరల దుకాణంలో అప్పగించారు. బియ్యాన్ని నిల్వచేసిన గుర్రాల పోసియ్యపై 6 ఎ కేసు నమోదు చేశామని డిటి దివాకర్ తెలిపారు. ఈ దాడుల్లో డిఎస్ఒ పార్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు రోడ్ కం రైల్వే వంతెనపై ఈ నెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని దేచర్ల గ్రామానికి చెందిన నూకతట్టి భూపతిరావు ఈనెల 12న వ్యక్తిగత పని మీద రాజమహేంద్రవరం వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా రోడ్డు కం రైల్వే వంతెనపై వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. అదే వ్యాన్ డ్రైవర్ రాజమహేంద్రవరంలో ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధిని ఓర్వలేకే వైసిపి విమర్శలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కూటమి హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి ఓర్వలేకపోతోందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ స్కీముల్లో భాగంగా మాత్రమే రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలు వచ్చాయ న్నారు. జగన్ నిర్వాకం వల్ల వాటి నిర్మాణం అతీగతీ లేకుండా పోయిందని విమర్శించారు. వైద్య కళాశాలలకు 2020లో రూ.8,480 కోట్లు కేటాయించారన్నారు. నాలుగేళ్లలో వైసిపి ఖర్చు చేసింది రూ.1,550 కోట్లు మాత్రమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని అన్నారు. ఇది వాస్తవమా.. అవాస్తమనేది అనేది చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక మెడికల్ కాలేజీని పూర్తి చేయాలంటే రూ.470 కోట్ల నుంచి రూ.600 కోట్లు అవసరం అవుతాయన్నారు. రూ.396 కోట్లతో పులివెందులలో మాత్రమే మెడికల్ కాలేజ్ పూర్తయిందన్నారు. మిగిలిన కళాశాలల నిర్మాణం ఎక్కడా 30 శాతం దాటలేదన్నారు. వీటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం పిపిపి విధానాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. దీని వల్ల ప్రభుత్వ వైద్య కళాశాలల కన్నా ఈ పద్ధతిలో పేద విద్యార్థులకు అదనంగా 110 సీట్లు వస్తున్నాయని, ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదన్నారు. తొలి విడతలో 4 మెడికల్ కళాశాలలు ప్రారంభమవుతాయని అన్నారు. విశాఖలో గుగూల్ డేటా సెంటర్ రాష్ట్రానికి రావడం గర్వకారణమన్నారు.

'ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని, మాట నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని రాజమహేం ద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రూ.10 లక్షలతో 43వ వార్డులోని ఆయేషా మసీదు వద్ద నిర్మించే షెడ్డు పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి ఘన విజయం సాధించడంలో ముస్లిములు కీలక పాత్ర పోషించారన్నారు. తమ భవాని చారిటబుల్ ట్రస్టు ద్వారా ఈ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. 45 రోజుల్లో దీన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

26న శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి - యానాం

యానాం కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ ఏటా ప్రతిష్టాత్మకంగా అందించే శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 26న నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ఆధ్యక్షుడు డాక్టర్ శిఖామణి తెలిపారు. ఈ ఏడాది శిఖామణి జీవన సాఫల్య పురస్కారం ప్రముఖ కవి, రచయిత, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. యువపురస్కారం ప్రముఖ కవి, విమర్శకుడు అవధానుల మణిబాబుకు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పురస్కారాలను ప్రదానం చేస్తారన్నారు. కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను డాక్టర్ కోయి కోటేశ్వరరావు, ఎస్ఆర్.పృథ్వి, పిఆర్ఎల్.స్వామి, బిహెచ్‌వి.మంగేష్, డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, పచ్చిమాల శివనాగరాజు, పుప్పాల సూర్య కుమారి, పొనుగు మట్ల అశోక్ కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్‌కు అందించనున్నారు.

హైవే నిర్మాణం, నిర్వహణలో లోపాలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

కత్తిపూడి నుంచి పామర్రు వరకూ నిర్మిస్తున్న 216 జాతీయ రహదారి నిర్మాణంలో, నిర్వహణలోను చాలా లోపాలు ఉన్నాయని, ఈ లోపాలను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. జాతీయ రహదారి నిర్మాణం ప్రారంభించి పదేళ్లు గడుస్తున్న ఇప్పటికీ రహదారి నిర్మాణం పూర్తి కాలేదని, ఈ కాలంలో అనేక రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. దీనిపై అనేకసార్లు జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ఏ విధమైన చర్యలూ చేపట్టకపోవడం విచారకరమన్నారు. నేషనల్ హైవే అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోతోందన్నారు.



శానిటేషన్ పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్

శానిటేషన్ పనుల తనిఖీ

ప్రజాశక్తి-కాకినాడ

నగరంలోని శానిటేషన్ పరిస్థితిని ఇన్‌ఛార్జి కమిషనర్ కెటి.సుధాకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలోని వార్ఫ్ రోడ్డు, జిల్లా పరిషత్ ప్రాంతాలు, 14వ సర్కిల్‌లోని గైగోలుపాడు ప్రాంతాల్లో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటేషన్ పనుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన శానిటేషన్ ప్రమాణాలు మెరుగు పర్చకపోతే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. 12వ సర్కిల్‌లోని మస్టర్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పారిశుద్య కార్మికుల హాజరు పత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సత్తిబాబు, దుర్గారావు పాల్గొన్నారు.

రౌతులపూడిలో 8వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడిలో దేవీ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీనివాస వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు సుమారు 8000 మంది యాత్రికులు అన్నదాన కార్యక్రమానికి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని బలరామపురం, ఎస్.పైడిపాల, గుమ్మరేగుల, బంగారయ్యపేట గ్రామాల నుంచి భారీ సంఖ్యలో యాత్రికులు హాజరైనట్టు పేర్కొన్నారు.

ఉపాధి హామీపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-రౌతులపూడి

ఉపాధి హామీ పథకంలో పని చేసే శ్రామికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇకెవైసిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కత్తిపూడి సెక్షన్ ఎపిడి భ్రమరాంబ ఉపాధి హామీ సిబ్బంది ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శివరామకృష్ణయ్య, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలవ్యాప్తంగా 24 వేల మంది ఉపాధి శ్రామికులకు గాను ఇప్పటివరకు 14,000 మందికి ఉపాధి హామీ పూర్తి చేసినట్టు తెలిపారు.


ఆదిత్యలో మహిళల ఆరోగ్యంపై సదస్సు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన హెలియోస్ హాస్పిటల్ డాక్టర్ లలిత కంభంపాటి, మరియు ముంబైకు చెందిన ఎంఎస్‌డి ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, సీనియర్ థెరపీ మేనేజర్ అష్రఫ్ మహమ్మద్ చావడా ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.డా. లలిత కంభంపాటి మహిళల్లో అండాశయ వ్యాధి నియంత్రణ, హార్మోన్ల సమతులారోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యత గురించి వివరించారు. అష్రఫ్ మహమ్మద్ చావడా గర్భాశయ క్యాన్సర్ టీకా ప్రాముఖ్యత, సర్వైకల్, ఇతర పెల్విక్ క్యాన్సర్ల నివారణలో పాత్ర గురించి తెలిపారు.

తాటిపాక సర్పంచ్ అభ్యర్థిగా రాజు

ప్రజాశక్తి-కోటనందూరు



సర్పంచ్ అభ్యర్థి సుర్ల రాజు

తాటిపాక సర్పంచ్ అభ్యర్థి సుర్ల రాజుకు తమ మద్దతు ఉంటుందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి లాలం బాబ్జి, ఎంపిపి లగుడు శ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజు గతంలో వైసిపి మండల యూత్ అధ్యక్షునిగా, మండల వ్యవసాయ శాఖ అడ్వయిజరీ కమిటీ చైర్మన్‌గా పని చేశారని తెలిపారు. తనకు మద్దతు ప్రకటించినందుకు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మండల కన్వీనర్ చింతకాయల చిన్నబాబు, గొర్ల రామచంద్రరావు, సుర్ల రాంబాబు, నల్లమల గోవింద్‌లకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

చదివిన స్కూల్లోనే టీచర్‌గా పోస్టింగ్

ప్రజాశక్తి-ఏలేశ్వరం



శానిటేషన్ పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్

తాను చదువుకున్న పాఠశాలలోనే ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా ఏలేశ్వరం దిబ్బలపాలెంకు చెందిన యువకుడు గొలగాని రాంబాబు ఉద్యోగం సాధించాడు. 2025 డిఎస్‌సిలో ఇంగ్లీష్ జిల్లా రెండో ర్యాంకు సాధించారు. రాంబాబు స్థానిక ఎంఇఒ కార్యాలయంలో బుధవారం ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ద్వారా స్థానిక హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా నియామక పత్రం అందుకున్నారు.

అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె.అబ్దుల్ కలామ్ జయంతిని నిర్వహించారు. తొలుత కలాం చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత విభాగం, కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో ఆర్-లాంగ్వేజ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి డి.ధనుంజయరావు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గణిత విభాగం హెడ్ జి.చంద్రశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డివిఎన్ఎస్.మూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్, గణిత విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మండలంలోని పైడిమెట్ట ఎంపిబిపి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం దున్నా దుర్గారావు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం జీవిత విశేషాలను హెచ్‌ఎం వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గూగుల్ రాకతో ఉద్యోగాల కల్పన

ప్రజాశక్తి-కాకినాడ

ప్రతిష్టాత్మకమైన గూగుల్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ వల్ల ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మొత్తం రెండు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని టిడిపి నేతలు తెలిపారు. గూగుల్ సంస్థను విశాఖకు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల నుండి సిఎం చంద్రబాబు, ఐటి మంత్రి లోకేష్ ఎంతోగానో శ్రమించారన్నారు. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, ఎంపీ సానా సతీష్ బాబు, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, మాజీ ఎంఎల్ఎ ఎస్వీఎస్ఎన్ వర్మతో కలిసి సమావేశంలో మాట్లాడారు. రూ.లక్షా 35 కోట్లతో గూగుల్ సంస్థ విశాఖలో భారీ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా లక్ష మందికి పరోక్షంగాను మరో 80 వేల మందికి పరోక్షంగాను ఉపాధి లభిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సిఎం జగన్ కక్షపూరిత పాలన వల్ల రాష్ట్రానికి ఎటువంటి పరిశ్రమలూ రాకపోగా రూ.10 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారన్నారు. సిఎం చంద్రబాబు రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకువచ్చి సంక్షేమాన్ని అందిస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి ఏసుదాసు, నురుకుర్తి వెంకటేశ్వరరావు, సుంకర పావని, ఎండి జహీరుద్దీన్ జిలానీ, చప్పిడి వెంకటేశ్వరరావు, బొళ్ల కృష్ణ మోహన్, కాకరాపల్లి చలపతి, మేకా లక్ష్మణ మూర్తి, ఆళ్ల బాలకృష్ణ, దేవు వెంకన్న పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గండేపల్లి



రక్తదానం చేస్తున్న ఆదిత్య విద్యార్థులు

గండేపల్లి మండలం, సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీ యూత్ రెడ్‌క్రాస్ యూనిట్ వారిచే రక్త దాన శిబిరం ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ప్రొఫెసర్ ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి తెలియజేసారు. ఈ రక్త దాన శిబిరం రోటరీ బ్లడ్ బ్యాంక్, పెద్దాపురం వారు బ్లడ్ యూనిట్లను స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో వైస్ చాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయం అన్నారు. రక్తదానం అంటే ప్రాణదానంతో సమానం అని రక్త దానం పట్ల ప్రజల్లో యువతలో ఉన్న అపోహలు తొలగిన నాడు మరింత ఎక్కువ సంఖ్యలో రక్తదానం చేయడానికి ముందుకు వస్తారనే అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకే స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కిషోర్ రోటరీ బ్లడ్ బ్యాంక్ పెద్దాపురం సిబ్బంది పాల్గొన్నారు 135 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి యూత్ రెడ్ క్రాస్ యూనిట్ కోఆర్డినేటర్, పి.శివ కుమార్ నేతృత్వం వహించారు.

అన్నదాన సేవలను విస్తృతం చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట



రోటీ మేకర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప

సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో నిత్యాన్నదానంను మరింత విస్తత పరుస్తున్నట్టు పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక భీమేశ్వరాలయంలో రోటీ మేకర్ యంత్రాన్ని ఎంఎల్ఎ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నలుమూలల నుంచీ స్థానిక ఆలయానికి తరలి వచ్చేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నందున ఆలయంలో అన్నదాన సేవలు మరింతగా పెంచి అందించాలని అధికారులకు సూచించారు. ఉత్తరాది ప్రాంతం వారి కోసం, పెద్దల కోసం చపాతీలను కూడా అన్నదానంలో అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు బిక్కిన సాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, ఆలయ చైర్మన్ కంటే జగదీశ్ మోహన్, సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

13 గంటల పని విధానంపై నిరసన

ప్రజాశక్తి - దేవరపల్లి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 13 గంటల పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని దుద్దుకూరు జాతీయ రహదారిపై కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరించిందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు ఎనిమిది గంటల పనివిధానం స్థానంలో 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆకాష్, కల్లేపల్లి కార్తీక్, టి.సత్యనారాయణ, మహమ్మద్ షఫీ, భాష, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - పెరవలి

సచివాలయ ఉద్యో గులంతా సమన్వయంతో విధులను నిర్వర్తించాలని తహశీల్దార్ కె.నిరంజన్, ఎంపిడిఒ పద్మజ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పన్నుల వసూలు, పారిశుధ్యం, ఐవిఆర్ఎస్ కాల్స్, పిజిఆర్ఎస్ నివేదికలు, క్రమశిక్షణ నియమావళి వంటి వాటిని సమన్వయంతో పని చేయాలని అన్నారు. అనంతరం విఆర్ఒలు, అగ్రికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఆర్టికల్చర్ అసిస్టెంట్లు, సొసైటీ సెక్రెటరీలు, రైస్ మిల్లర్స్‌తో సమీక్ష సమావేశం జరిగింది. పంట కోత ప్రయోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిహెచ్. వెంకటరమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్ష శిక్షార్హం


ప్రజాశక్తి - ఉండ్రాజవరం

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే లింగ నిర్ధారణ చట్టం ప్రకారం శిక్షింపబడతారని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ బిడ్డ అయితే గర్భస్రావం చేయించి, చంపడం జరుగుతోందని, ఇది సరియైన పద్ధతి కాదన్నారు. ఆడ బిడ్డ అయినా, మగ బిడ్డ అయిన ఒకటే అని, ఇద్దరినీ సమానంగా చూస్తూ, ఇద్దరినీ చదివించాలన్నారు. తద్వారా ఆ కుటుంబం ఆర్థిక స్వావలంబన సాధించటం తో పాటు, సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఎం.సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్, కెడివిఎల్.కుమారి, సూపర్‌వైజర్లు సిహెచ్.రత్నకుమారి, కె.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఎంఎల్ఎ ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాను రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగర పాలక సంస్థ ఆవరణలోని ఆయన ఛాంబర్‌లో పార్టీ నాయకులతో పాటు రాహుల్ మీనాను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు రాజమహేంద్రవరం సిటీ అభివృద్ధి, రానున్న పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై చర్చించారు. టిడిపి నగర కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు వారి వెంట ఉన్నారు.



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కాకినాడ

కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన పిలుపులో భాగంగా కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు కార్యకర్తలతో పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టి ప్రజలకు ఓటర్లను ప్రభుత్వాలు ఏ విధంగా మోసం చేస్తున్నాయనే దానిపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు కాకినాడలో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలతో కలిసి సంతకాలు చేపట్టారు. చెక్క నూకరాజు, మట్ట ప్రసాద్, యాళ్ళ రామకష్ణ పాల్గొన్నారు.